గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లోకి చేరుకుంటున్న జలాలు

'కాళేశ్వరం' పరవళ్లు

- లింక్-1లో కొనసాగుతున్న ఎత్తిపోతలు
- నంది, గాయత్రీ పంప్‌హౌస్‌ల్లో నాలుగేసి మోటర్లు రన్

కరీంనగర్, జూలై 28(నమస్తే తెలంగాణ)/ధర్మారం/రామడుగు: కాళేశ్వరగంగ పరవళ్లు తొక్కుతున్నది. లింక్-2లో ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు జలాశయానికి పరుగిడుతున్నది. పెద్దపల్లి జిల్లా నంది పంప్‌హౌస్‌లో 4, 5, 6, 7 మోటర్ల ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 చొప్పున 12,600 క్యూసెక్కులు డెలివరీ సిస్టర్న్‌ల ద్వారా రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. అక్కడి నుంచి కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలుతున్నాయి. ఇక్కడా నాలుగుమోటర్ల(1, 2, 3, 4)ద్వారా 12,600 క్యూసెక్కులు లిఫ్ట్ చేస్తుండగా, గ్రావిటీ కాల్వ ద్వారా ఎస్సారెస్పీ వరద కాల్వలోకి చేరుతున్నాయి. అక్కడి నుంచి సిరిసిల్ల జిల్లా రాజరాజేశ్వర జలాశయం(మధ్యమానేరు)కు చేరుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి సుమారు ఒక టీఎంసీ జలాలను మధ్యమానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రీ పంపుహౌస్‌లో బాహుబలి మోటర్ల డెలివరీ సిస్టర్న్‌ల నుంచి ఉబికివస్తున్న జలాలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఈసీసీ, టీపీఎఫ్ సభ్యులు

పౌల్ట్రీరంగాన్ని ఆదుకోండి

సీఎం రేవంత్‌కు ఎన్‌ఈసీసీ, టీపీఎఫ్ వినతి

హైదరాబాద్, జూలై 28: సంక్షోభంలో పడిన పౌల్ట్రీరంగాన్ని ఆదుకోవాలంటూ నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎన్‌ఈసీసీ), తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ (టీపీఎఫ్) ప్రతినిధులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. మొక్కజొన్న సహా ఇతర దాణా రేట్లు పెరగడంతో పౌల్ట్రీరంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ప్రభుత్వం తరపున కోళ్లదాణాపై రాయితీ ఇవ్వడం ద్వారా ఈ రంగాన్ని ఆదుకోవాలని కోరారు. సీఎంను కలిసిన వా రిలో టీపీఎఫ్ అధ్యక్షుడు కాసర్ల మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉడుతల భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు ఉప్పల నర్సింహారెడ్డి, ఎన్‌ఈసీసీ(హైదరాబాద్) చైర్మన్ గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వంగేటి బాలకృష్ణారెడ్డి, ఈసీ సభ్యుడు జక్క సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

స్కిల్ వర్సిటీకి 1న శంకుస్థాపన

రూ.100 కోట్లతో 57 ఎకరాల్లో ఏర్పాటు • మీర్‌ఖాన్‌పేట్‌లో స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్

కందుకూరు, జూలై 28: రంగారెడ్డి జిల్లా కందుకూరులోని మీర్‌ఖాన్‌పేట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ (వృత్తి నైపుణ్యాభివృద్ధి) యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.100 కోట్లతో 57 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ వర్సిటీకి ఆగస్టు 1న శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. ఆదివారం రాత్రి ఆయన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌తో కలిసి ఆ వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత మ్యాప్‌ను పరిశీలించాక అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఫార్మాసిటీలో మెడికల్ కళాశాల ఏర్పాటుకుబీఆర్ఎస్ హయాంలో మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి వేసిన శిలాఫలకం పక్కనే ఈ వర్సిటీ స్థాపనకు ఏర్పాట్లు చేయడం గమనార్హం.

ఆర్డర్ తప్పిన బదిలీలు

- మైనార్టీ గురుకుల బదిలీల్లో అయోమయం
- ప్రమోషన్లలో అవకతవకలు
- సీనియార్టీకి విరుద్ధంగా పోస్టింగ్‌లు
- పదోన్నతిచ్చిన మరుసటి రోజే రివర్షన్
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆగ్రహం
- ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, జూలై 28 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకులాలకు సంబంధించి విడుదలచేసిన ప్రమోషన్లు, బదిలీల ఉత్తర్వుల్లో గందరగోళం నెలకొన్నదని, తప్పులతడకగా ఉన్నదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రొసీజర్లను ఫాలో కాకుండా ఇష్టం వచ్చినట్టు ఆర్డర్ ఇస్తున్నదని గురుకుల సొసైటీ యాజమాన్యాన్ని తప్పుబడుతున్నారు. మొదట వెబ్ కౌన్సిలింగ్ అని చెప్పి త ర్వాత మాన్యువల్‌గా మార్చారని, లాంగ్ స్టాండింగ్ ఉన్నవారికి, అక్కడే ప్రమోషన్లు ఇవ్వడాన్ని తప్పుబడుతూ కోర్టుకు వెళ్లినవారికి ప్రమోషన్లను నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెస్సీ బాటనీ చేసినవారికి జేఎల్ జువాలజీలుగా పదోన్నతి కల్పించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చే సుకోవచ్చునని ఉదహరిస్తున్నారు. సమస్యను చెప్పుకునేందుకు సంస్థ కార్యదర్శిని కల వడానికి వెళ్తే కొం దరు ఉన్నతాధికారులు అడ్డుపడుతున్నారని ఆరోపిస్తున్నారు. మైనార్టీ గురుకులాల్లో బదిలీ, ప్రమోషన్ ఉత్తర్వులను చూస్తే ప్రభుత్వ సంస్థా? లేక ప్రైవేట్ సంస్థా? అనే భావన కలుగుతున్నదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి.

పేర్లు లేకుండానే ఉత్తర్వులు

ప్రభుత్వం ఒక ఉత్తర్వు ఇవ్వాలంటే కచ్చితంగా ఒక ఫైల్ మూమెంట్ తర్వాత, అప్రూవలైన తర్వాత ఆ ఫైల్ నెంబరు ప్రొసీడింగ్స్ నెంబర్‌ను మెన్షన్ చేస్తూ బదిలీ లేదా ప్రమోషన్ లేదా నియామకం ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి ఉత్తర్వు మీద దానిని జారీచేసిన అధికారి పేరు, హోదాను పేర్కొనడం సంప్రదాయం. అప్రూవల్ కాపీలో ఉండే ప్రొసీడింగ్స్‌ను ఆధారంగా చేసుకొని ప్రతి ఉద్యోగి వివరాలు వారి సర్వీస్ రిజిస్టర్లలో నమోదు చేస్తుంటారు. కానీ, మైనార్టీ గురుకులంలో అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రైవేట్ కార్పొరేట్ సెక్టార్‌లో సర్టిఫికెట్ ఇచ్చిన మాదిరిగా ప్రమోషన్, బదిలీ, నూతన నియామక ఉత్తర్వులను జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. వాటిని ఏవిధంగా సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలనేది తెలియక సిబ్బంది అయోమయంలో పడిపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వాటికి పరిష్కారం చూపించాలని ఉపాధ్యాయ వర్గం డిమాండ్ చేస్తున్నది. ప్రమోషన్స్ ఇవ్వడం, మరుసటి రోజే రివర్షన్ ఉత్తర్వులు ఇవ్వడం సొసైటీలో పరిపాటిగా మారింది. ప్రమోషన్ల ప్రక్రియ ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఒక రోస్టర్ పాయింట్‌ను ఫిక్స్ చేసుకొని కొనసాగుతుంది. కానీ, మైనార్టీ గురుకులంలో ఆ పరిస్థితి లేదు. ప్రమోషన్ ఉత్తర్వులు తీసుకున్న ఉద్యోగులకు 24 గంటలు గడిచేలోగానే రివర్షన్ ఉత్తర్వులు ఇస్తున్న దుస్థితి నెలకొన్నది. ఇటీవల కొంత మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇస్తూ కౌన్సిలింగ్ ద్వారా కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు. ఆ మరుసటి రోజునే రివర్షన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. కోరుకున్న చోటు దక్కకపోగా, ప్రమోషన్ రాక ముందు పనిచేస్తున్న స్థానం కోల్పోయి, అటు ఇటు కాకుండా సుదూర ప్రాంతాల్లో పనిచేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇదంతా సొసైటీలోని పలువురు ఉన్న తాధికారులు కుట్రపూరితంగానే చేస్తున్నారని ఉద్యోగసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

సీనియర్స్‌ను వదిలి జూనియర్స్‌కు..

ఒక ప్రాంతంలో ఎక్కువ కాలం పనిచేసినవారికి ప్రమోషన్స్ వస్తే కచ్చితంగా వేరే ప్రాంతానికి బదిలీ చేయాలనేది నిబంధన. మైనార్టీ గురుకులంలో ఆ నిబంధనలేవీ పాటించడం లేదు. ఒకే ప్రాంతంలో ఏడేండ్లు పూర్తయినప్పటికీ సదరు ఉద్యోగులకు అక్కడే ప్రమోషన్లను కల్పిస్తున్నారు. ప్రమోషన్లలో లాంగ్వేజ్ టెస్ట్ పాస్ కాలేదని కొందరికి ఆపివేయడం విచిత్రం. పరపతి ఉన్నవారిని ఒకతీరుగా, లేనివారిని ఒక తీరుగా చూస్తూ, కొందరు ఉన్నతాధికారులు అక్రమాలకు తెరలేపారని, డబ్బులిస్తే చాలు టాప్ ర్యాంకర్స్‌ను సైతం పక్కనపెట్టి జూనియర్స్‌కు ప్రమోషన్లు ఇస్తున్నారని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. సొసైటీ తీరుతో మానసిక క్షోభ అనుభవిస్తూ దవాఖానలో చేరాల్సిన దుస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. ప్రభుత్వం సత్వరం జోక్యం చేసుకుని ప్రమోషన్లు, బదిలీలు, నూతన నియామకాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే సొసైటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	31.0°c	26.0°c
నల్లగొండ	31.0°c	24.0°c
హైదరాబాద్	30.2°c	24.0°c
కరీంనగర్	30.0°c	26.0°c
వరంగల్	30.0°c	24.0°c
రంగారెడ్డి	29.2°c	23.4°c
మెదక్	28.7°c	22.6°c
మహబూబ్‌నగర్	28.3°c	23.5°c
ఆదిలాబాద్	28.2°c	23.2°c
నిజామాబాద్	27.5°c	23.8°c

మరో రెండు రోజులు వాన

హైదరాబాద్ వాతావరణ శాఖ

హైదరాబాద్, జూలై28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మరో రెండు రోజులపాటు రాష్ట్రంలో వానలు కురవనున్నట్టు హైదరాబాద్ వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాజన్న-సిరిసిల్ల, వరంగల్, హన్మకొండ, జగిత్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతాల్లో గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు మరికొన్ని జిల్లాలకు అధికారులు రెడ్‌అలర్ట్ జారీ చేశారు. గడిచిన 24 గంటల్లో ములుగు జిల్లా ఏటూరు నాగారంలో 8.49 సెం.మీ, ఆదిలాబాద్ అర్బన్‌లో 5.05 సెం.మీ, భూపాలపల్లిలో 4.52 సెం.మీ, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో 4.34 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

గోదావరి తగ్గుముఖం

లక్ష్మీ, అన్నారం, సమ్మక్క బరాజ్‌లకు తగ్గిన వరద

భద్రాద్రి కొత్తగూడెం, (నమస్తే తెలంగాణ)/మహదేవపూర్(కాళేశ్వరం)/కన్నాయిగూడెం, జూలై 28: భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయం 6 గంటలకు 53 అడుగులుగా ఉన్న వరద ప్రవాహం.. మధ్యాహ్నం 2 గంటలకు మూడు అడుగులు తగ్గి 50 అడుగులకు చేరుకుంది. సాయంత్రానికి మరో అడుగు తగ్గి 49 అడుగుల వద్ద కొనసాగుతుంది. సోమవారం ఉదయానికి మరికొంత తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 48 అడుగులకు పైన ప్రవాహం కొనసాగుతున్నందున రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. అధికారులు ఆదివారం 25 గేట్లు పూర్తిగా ఎత్తి 26,986 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ బరాజ్‌కు వరద ప్రవాహం తగ్గుతున్నది. శనివారం బరాజ్ ఇన్‌ఫ్లో 5,39,200 క్యూసెక్కులు ఉండగా, ఆదివారం ఇన్‌ఫ్లో 4,06,510 క్యూసెక్కులకు తగ్గింది. బరాజ్‌లోని అన్ని గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌లోకి చిన్న చిన్న కాల్వలు, మానేరు ద్వారా ఆదివారం 8,147 క్యూసెక్కుల ప్రవాహం రాగా, మొత్తం 66 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్‌లోకి ఆదివారం 8,45,560 క్యూసెక్కుల వరద చేరింది. బరాజ్ వద్ద పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్లు కాగా, ప్రస్తుతం 81.80 మీటర్ల ఎత్తులో పారుతున్నది. 59 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం

- జూరాలకు 3 లక్షల క్యూసెక్కుల వరదనీరు
- శ్రీశైలం ప్రాజెక్టులో 150 టీఎంసీలకు చేరిక
- ప్రాణహిత నదిలో తగ్గిన వరద ఉధృతి

హైదరాబాద్, జూలై28 (నమస్తే తెలంగాణ): ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో కృష్ణానది ఉధృతంగా ప్రవాహిస్తున్నది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పొంగి పొర్లుతున్నది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి దిగువన జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు భారీగా వరద పోటెత్తుతున్నది. ఆదివారం సాయంత్రానికి జూరాలకు 3 లక్షల క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 4.14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహం కొనసాగుతున్నది. 24 గంటల్లోనే శ్రీశైలం ప్రాజెక్టుకు 25 టీఎంసీలకు పైగా వరదనీరు వచ్చి చేరడం విశేషం. మరోవైపు ప్రాణహిత, గోదావరిలో వరద తగ్గుముఖం పట్టింది. ఎగువన ఎస్సారెస్పీ, దాని దిగువన ఎల్లంపల్లి, లక్ష్మీ బరాజ్‌ల వద్ద వరద నెమ్మదించింది. దిగువన ఇంద్రావతి, తాలిపేరు, శబరి నుంచి భారీగా వరద కొనసాగుతుండటంతో భద్రాచలం వద్ద వరద ప్రవాహం స్వల్పంగా తగ్గినా స్థిరంగా కొనసాగుతున్నది.

ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు

హైదరాబాద్, జూలై 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలని సూచించింది. ఒక్కో యూనిట్‌ను రూ.2 లక్షల అంచనా వ్యయంతో నాలుగు మూత్రశాలలు, ఒక మరుగుదొడ్డి ఉండేలా ప్లాన్ చేసి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

7న అమృతసర్‌లో ఓబీసీ జాతీయ మహాసభలు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, జూలై28 (నమస్తే తెలంగాణ): పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్ నగరంలో ఆగస్టు 7న ఓబీసీ జాతీయ మహాసభలను నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్ల సాధనకు మహాసభల్లో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. మహాసభకు హాజరుకావాలని కోరుతూ ఆదివారం కేంద్ర, రాష్ట్ర మంత్రులు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఆహ్వానించామని తెలిపారు.

పూర్తి ఆయకట్టుకు నీళ్లిస్తాం

- బరాజ్‌లు మినహా కాళేశ్వరం సిస్టమ్ వాడుకుంటాం
- మంత్రులపై కేటీఆర్ ఆరోపణలు అబద్ధం
- ఆధారాలు ఉంటే విచారణ కమిషన్‌కు ఇవ్వాలి
- ఇరిగేషన్‌పై సమీక్షలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూలై28 (నమస్తే తెలంగాణ): అన్ని ప్రాజెక్టుల కింద ఈ ఏడాది పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మూడు బరాజ్‌లు మినహా ఎల్లంపల్లి నుంచి ఉన్న మిగతా వ్యవస్థనం తటినీ వాడుకుంటామని పునరుద్ఘాటించారు. జల సౌధ వేదికగా రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఇరిగేషన్‌శాఖ అధికారులతో ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాజెక్టులవారీగా పనుల పురోగతిని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాబోయే ఏడాదిలో 6.50 లక్షల ఎకరాల, ఆయకట్టుకు, రానున్న ఐదేండ్లలో 30 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలనేది లక్ష్యమని చెప్పారు. నీటి పారుదలశాఖకు నిధుల కేటాయింపులు బాగున్నాయని, లక్ష్యాలకు అనుగుణంగా పనులు వేగవంతం చేసే బాధ్యత అధికారులదేనని స్పష్టంచేశారు. పనులు సకాలంలో పూర్తి చేస్తే గుర్తిస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే విజ్ఞప్తులను వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇద్దరు మంత్రులపై నిందారోపణలు చేయడం సహేతుకం కాదని, ఏమైనా ఆధారాలు ఉంటే విచారణ కమిషన్‌ను కలిసి సమాచారం ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ప్రశాంత్‌పాటిల్, ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, హరిరాం, చీఫ్ ఇంజినీర్లు, పలువురు ఎస్ఈలు పాల్గొన్నారు.

ఉత్తమ్ సాక్షిగా విద్యుత్తు అంతరాయం

వెంటనే పునరుద్ధరించాం: అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరంతరం విద్యుత్తు సరఫరా చేస్తున్నామని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్భాటంగా ప్రకటన చేసి 24 గంటలు గడవక ముందే భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఖైరతాబాద్ జలసౌధలో ఆదివారం సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతుండగానే విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో ఒక్కసారిగా అక్కడున్న వారంతా అవాకయ్యారు. ఖైరతాబాద్ జలసౌధలో కరెంటు సరఫరా నిలిచిపోయిన ఘటనపై హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ అధికారులు స్పందించారు. విద్యుత్తు లైన్‌లో సాంకేతిక సమస్యలతో సుమారు రెండు నిమిషాలపాటు ట్రిప్ అయిందని, దాన్ని సరిచేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించామని వివరణ ఇచ్చారు.

పాతబస్తీ బోనాలకు 5 లక్షలే ఇస్తారా?:బండి సంజయ్

హైదరాబాద్, జూలై 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పాతబస్తీలోని 24 ఆలయాల్లో బోనాల పండుగకు కేవలం రూ.5 లక్షలే కేటాయిస్తారా? అని రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రంజాన్ పండుగకు రూ.33 కోట్లు కేటాయించి, తట్టిగీ జమాతే సంస్థకు రూ.2.4 కోట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం బోనాల పండుగపై నిర్లక్ష్యం చూపిందని ఆరోపించారు. హిందువులే మైనా బిచ్చగాళ్లనుకుంటున్నరా? అని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి రాగానే పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు.

ఎన్టీపీసీ విద్యుత్తు అవసరం లేదా?:కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 28 (నమస్తే తెలంగాణ): ఎన్టీపీసీలో ఉత్పత్తి కాబోయే విద్యుత్తు తెలంగాణకు అవసరం లేదా? అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే ప్రాజెక్టుకు కేంద్రం ఆమోద ముద్ర వేసిందని గుర్తుచేశారు. ఇందులో ఇప్పటికే 1,600 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతున్నదని, తెలంగాణ ప్రభుత్వానికి ఆసక్తి లేకపోతే విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తుందని చెప్పారు.

మాఫీకి మరో వాయిదా?

మొదటిపేజీ తరువాయి...

సీఎం రేవంత్‌రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం కొత్ర చౌరస్తాలో దివంగత జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని మంత్రులు దామోదర రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆదివారం ఆవిష్కరించిన అనంతరం కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఇప్పటికే రుణమాఫీపై రైతాంగంలో గందరగోళం నెలకొన్నది. లక్షలోపు రుణాలన్నీ మాఫీ చేసినట్టు ప్రభుత్వం చెప్తున్నా.. దాదాపు సగం మంది రైతులు తమకు జరగనే లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టులో తన విదేశీ పర్యటన తర్వాత రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తానని ముఖ్యమంత్రి తాజాగా చెప్పడంతో అనుమానాలు మరింత తీవ్రమయ్యాయి. అసలు సీఎం విదేశీ పర్యటనకు, రుణమాఫీ అమలుకు సంబంధం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది. మరోసారి రుణమాఫీ గడువు మారుతున్నదా అనే చర్చ జరుగుతున్నది. ఎన్నికలకు ముందు డిసెంబర్ 9న రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు చెప్పుకొచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ తేదీ మారిపోయింది. మొదట్లో ఆ హామీని కాంగ్రెస్ సర్కార్ అటకెక్కిస్తున్నదన్న ప్రచారమూ సాగింది. 'ఆగస్టు 15లోపు రుణమాఫీ సహా గ్యారెంటీలన్నీ అమలు చేయకపోతే రాజీనామాకు సిద్ధమా..?' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసరడంతో.. రేవంత్‌రెడ్డిపై ఆ ఒత్తిడి బలంగా పనిచేసింది. దీంతో ఆగస్టు 15 నాటికి రుణమాఫీ పూర్తిచేస్తామని రేవంత్ ప్రకటించాల్సి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో నిర్వహించిన అన్ని సభల్లోనూ ఆగస్టు 15 లోపు రుణమాఫీపై దేవుళ్లం దరి మీద రేవంత్ ఒట్టు పెట్టారు. తాజాగా కల్వకుర్తి సభలో మాత్రం ఆగస్టు 15 అని అనకుండా ఆగస్టులోగా చేస్తామంటూ నర్మగర్భపు వాఖ్యలు చేశారని, దీని వెనుక ఏదో మర్మం ఉన్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పర్యటనకు.. రుణమాఫీకి సంబంధమేంటి?

తాను 14 వరకు విదేశీ పర్యటనకు వెళ్తున్నానని, తిరిగి రాగానే మొత్తం రుణమాఫీ చేస్తానంటూ సీఎం చేసిన ప్రకటనపై నిపుణులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. విదేశీ పర్యటనకు రుణమాఫీ పూర్తికి సంబంధమేమిటని ప్రశ్నిస్తున్నారు. 14న వస్తే 15లోగా రుణమాఫీ చేయవచ్చు కదా అని సందేహిస్తున్నారు. తమకు డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు ఇవ్వకపోవడంపై ముఖ్యమంత్రి సభలో మహిళలు నిరసన తెలిపారు. ఆదివారం జరిగిన సభలో నియోజకవర్గ అభివృద్ధికి 309 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభం కాగానే డిమాండ్లతో కూడిన పేపర్లను ప్రదర్శించారు. పోలీసులు వచ్చి కాగితాలను గుంజుకున్నారు.

సోమేశ్‌కుమార్‌పై కేసు

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లో భారీ అవకతవకలపై సీసీఎస్‌లో ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖలో రూ.1000 కోట్ల కుంభకోణంపై ఆ శాఖ కంప్యూటర్ విభాగం జాయింట్ కమిషనర్ రవి కనూరి శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఐఐటీ-హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామప్రసాద్, పిలాంటో టెక్నాలజీస్ తదితరులపై వివిధ కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆగస్టు 1న మహాధర్నా

హైదరాబాద్, జూలై 28 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ